RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 15 సంచిక : 178 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం బుధవారం, 31 డిసెంబర్ 2025 పేజీలు : 4 వెల : 2/-

## మరో ఎన్నికలకు ఈసీ రెడీ..

హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇటీవల తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు హెూరాహెూరీగా జరిగాయి. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి కొనసాగింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు ఎక్కువమంది గెలివగా.. తర్వాతి స్థానంలో బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసిన సర్పంచ్‌లు ఉన్నారు.

ఇక మూడో స్థానంలో బీజేపీ నిలిచింది. ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో.. తెలంగాణలో మరో స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది.

**త్వరలో మరో ఎన్నికలు...** ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఓటర్ల సవరణ జాబితా సిద్ధం చేయాలని ఈసీ నిర్ణయించింది. మంగళవారం నుంచి ఓటర్ల లిస్ట్ సవరణ ప్రక్రియ ప్రారంభం కాగా.. వచ్చే ఏడాది జనవరి 10లోపు పూర్తి చేయనుంది. జనవరి 1న ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేయనున్నారు. ఈ లిస్ట్‌కు సంబంధించి ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన తర్వాత జనవరి 10న తుది జాబితా విడుదల చేస్తారు.

దీని ఆధారంగా ఎన్నికలను నిర్వహిస్తారు. రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో ఎన్నికలు జరగనున్నాయి. కరీంనగర్, మంచిర్యాల, నిజామబాబాద్, కొత్తగూడెం, మహబూబ్ నగర్, రామగుండం కార్పొరేషనన్లకు ఎన్నికలు జరగనున్నాయి.

**ఫిబ్రవరిలో ఎన్నికలు..?...** జనవరిలో ఓటర్ల జాబితా సిద్ధం కానుండగా.. ఫిబ్రవరిలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ల ఎన్నికలు జరిగే




### ఫిబ్రవరిలో మోగనున్న నగారా..!

అవకాముందని తెలుస్తోంది. ఇక ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను కూడా అదే నెలలో జరిపే ఛాన్స్ ఉంది. దీంతో ఫిబ్రవరిలో తెలంగాణలో మరో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం ప్రారంభం కానుంది. ఇటీవల సర్పంచ్ ఎన్నికలు ముగియగా.. కొత్త సర్పంచ్‌లు ప్రమాణస్వీకారం చేశారు.




తిరుమల: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమలను సందర్శించారు. ఇవాళ(మంగళవారం) ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీవారిని రేవంత్ రెడ్డి కుటుంబసమే తంగా దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు రేవంత్ కుటుంబస భ్యులకు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న రేవంత్ కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి పూజారులు శ్రీనివాసుడి తీర్థప్రసాదాలు అందజేశారు. మరోవైపు సాధారణ భక్తులు తిరుమలకు పోటెత్తారు. ఏకాదశి సందర్భంగా ద్వార దర్శనం కోసం భారీగా తిరుమలకు చేరుకున్నారు. తండోపతండాలుగా వస్తున్న భక్తులతో తిరుమల ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల తాకిడికి తగినట్లుగానే అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలూ కల్పించారు. పోలీసులు సైతం పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. కాగా, ముక్కోటి ఏకాదశి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆలయాలు కిక్కిరిపోతున్నాయి. తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు భక్తులు చేరుకుంటున్నారు. తెలంగాణలో యాద్రాద్రి, భద్రాచలం, ధర్మపురి, చిలుకూరి బాలాజీ సహా పలు పుణ్యక్షేత్రాల వద్ద భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఇక, ఏపీలోని తిరుమల, సింహాద్రి అప్పన్న ఆలయం, ద్వారకా చినతిరుమల సహా వివిధ ఆలయాలకు భక్తులు తండోపతండాలుగా తరలివెళ్తున్నారు.




### వైకుంఠ ఏకాదశి.. తెలుగు రాష్ట్రాల్లో ఆలయాల వద్ద భక్తుల రద్దీ

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని ఆలయా ల్లో రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు శ్రీమహా విష్ణువు దర్శనానికి తరలివస్తున్నారు. ఉత్తర ద్వార దర్శనాలు చేసుకుంటున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామునే ఉత్తర ద్వారాన్ని తెరిచారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకుంటున్నారు. విజయవాడ కనకదుర్గ ఆలయం, యాదాద్రి లక్ష్మీనరసింహస్వా మి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో ఘనంగా వైకుంఠ ద్వార దర్శనం వేడుక ప్రారంభమైంది. ఉత్తర ద్వార దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. గరుడ వాహనంపై శ్రీరామచంద్రస్వామి వారు, గజ వాహనంపై సీతమ్మ, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి దర్శనమిచ్చారు.

**భద్రాచలంలో..** విశాఖ జిల్లా సింహాచలం పుణ్యక్షేత్రంలో ఉత్తర ద్వార దర్శనం వైభవోపేతంగా ప్రారంభమైంది. సింహాద్రి నాథుడు వైకుంఠ నారాయణుడి అలంకరణలో భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ పి.గణబాబు స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సినీనటుడు చిరంజీవి, ఆయన కుటుంబ సభ్యులు, భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్లా, తితిదే బోర్డు సభ్యురాలు సుచిత్ర ఎల్లా, సినీనటుడు నారా రోహిత్ దంపతులు, క్రికెటర్ తిలక్ వర్మ, సినీ నిర్మాత డీవీవీ దానయ్య తదితరులు దర్శించుకున్నారు.

## తిరుమలలో తెలంగాణ భవన్




హైదరాబాద్ : దేవ దేవుడు కలియుగ వైకుంఠం అయిన తిరుమలలో వెలసిన వెంకటేశ్వర స్వామి వారు ప్రపంచానికే దేవుడుగా ఉన్నారు. ఆయన కోసం దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తూంటారు. స్వామి వారి దర్శన భాగ్యం కోసం ఎంతో మంది ఆరాటపడతారు.

వారిలో పెద్ద చిన్న అన్న తారతమ్యం అయితే లేదు. ఎంతటి పదవిలో ఉన్నా కూడా స్వామి దర్శనం కోసం రావాలని ఆయన కరుణా కటాక్ష వీక్షణాలను అందుకోవాలని చూస్తారు. ఉమ్మడి ఏపీలో ఉన్నపుడు మొత్తం తెలుగు వారు అంతా వెంకన్న స్వామి కి ఏ ఇబ్బంది లేకుండా దర్శించుకునేవారు. అయితే విభజన ఏపీలో మాత్రం తెలంగాణా వారికి కొత్త సమస్యలు వస్తున్నాయని వాపోతున్నారు.

**ప్రాధాన్యత ఏదీ :** రాష్ట్రం విడిపోయినా అంతా ఒక్కటి అని అంటున్నా తమకు తిరుమలలో సరైన ప్రాధాన్యత అయితే దక్కడం లేదని తెలంగాణాకు చెందిన కొంతమంది ప్రజా ప్రతినిధులే ఆవేదన వ్యక్తం చేయడం విశేషం. తెలంగాణాకు చెందిన ఎమ్మెల్యేలు మంత్రులకు సైతం తగిన ప్రాముఖ్యత అయితే లేకుండా పోతోందని మాజీ మంత్రి బీఆర్ఎస్ కీలక నాయకుడు గతంలోనే ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చాలా మంది అయితే ఇదే మాటగా ఉంది. వారు మనసులో ఏదీ దాచుకోకుండా పూర్తిగా తన అసంతృప్తిని వెళ్ళగక్కారు.

**ఆ పనిచేస్తే బాగు :** ఇక తాజగా సోమవారం నుంచి ప్రారంభం అయిన తెలంగాణా శాసనసభ సమావేశాలలో బీఆర్ఎస్ కి చెందిన ఎమ్మెల్యే మాజీ మంత్రి గంగుల కమలాకర్ అయితే ఇదే విషయాన్ని సభలో ప్రస్తావించడం విశేషం. ఆయన తెలంగాణా నుంచి తిరుమలకు వెళ్ళిన ప్రజా ప్రతినిధులకు అయితే ఇబ్బందులే ఎదురవుతున్నాయని బాధను వ్యక్తం చేశారు. ఈ విషయంలో పరిష్కారాలు చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. వీలు అయితే తిరుపతిలో తెలంగాణా భవన్ ని నిర్మించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది అని సూచనలు కూడా ఇచ్చారు.

**బసతో పాటు అన్నీ :** తిరుమలకు మంత్రులు వెళ్తే ఒకలా ఉంటోందని ఇతర ప్రజా ప్రతినిధులు వెళ్తే మరోలా ఉంటోందని కూడా ఆయన చెప్పారు. దర్శనమే కాదు బసకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అందువల్ల తిరుమలలో తెలంగాణా భవన్ ని ఏర్పాటు చేయడం ఉత్తమనని సూచించారు. ఇప్పటికే తిరుపతిలో కర్ణాటక భవన్, తమిళనాడు భవన్ ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఇపుడు తెలంగాణా భవన్ ని కూడా నిర్మిస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. అయితే ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి ఆలోచిస్తుందో చూడాల్సి ఉంది. ఎందుకంటే ఏపీ ప్రభుత్వంతో సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. అయితే సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబుకు మధ్య మంచి రిలేషన్స్ ఉన్నాయని అంటారు కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వంలో అయితే కచ్చితంగా తిరుపతిలో తెలంగాణా భవన్ నిర్మాణం జరిగి తీరవచ్చు అన్న ఆశలు కూడా అందరిలో ఉన్నాయట.

## జనవరి 1, 2026...

# భారత్ కీలక అడుగు!




### గోల్డ్ మార్కెట్‌లో ప్రకంపనలు, షాక్‌లో డొనాల్డ్ ట్రంప్!

న్యూయార్క్: 2026 జనవరి 1వ తేదీ నుండి బ్రిక్స్ భద్రతా మండలి నాయకత్వ బాధ్యతలను భారత్ స్వీకరించనుంది. ప్రపంచ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఉన్న ఈ సమయంలో అమెరికా అనుసరిస్తున్న కఠిన వైఖరి కారణంగా భారత్, చైనా, రష్యా వంటి దేశాలు ఊహించని విధంగా ఏకమయ్యాయి. ఈ మూడు దేశాలనూ డొనాల్డ్ ట్రంప్ వ్యతిరేకిస్తుండటంతో.. అవి మరింత దగ్గరయ్యాయి. ఇది బంగారం మార్కెట్ నుండి ముడి చమురు మార్కెట్ వరకు ప్రపంచ స్థాయి ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు భావిస్తున్నారు. బ్రిక్స్ దేశాల ఉత్పత్తులపై 100% పన్ను విధిస్తానని ట్రంప్ చేసిన హెచ్చరికలే ఈ దేశాలన్నీ ఏకం కావడానికి ప్రధాన కారణమయ్యాయి. బంగారం మరియు ముడి చమురుపై పట్టు: ఏ దేశానికైనా రాజకీయ బలం అనేది ముడి చమురు ఉత్పత్తి, బంగారు నిల్వలు, ఆర్థిక శక్తి మరియు ఆహార స్వయంసమృద్ధిపై ఆధారపడి ఉంటుంది. ఈ నాలుగు కీలక అంశాల్లో 11 బ్రిక్స్ దేశాలు గణనీయమైన వాటాను కలిగి ఉన్నాయి. ముడి చమురు: 2024 నివేదిక ప్రకారం ప్రపంచ ముడి చమురు ఉత్పత్తిలో 42 శాతం బ్రిక్స్ దేశాల నుండే వస్తోంది. ఇందులో సౌదీ అరేబియా, రష్యా, ఇరాన్, చైనా మరియు యూఏఈ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. బంగారం: ప్రపంచ కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న బంగారు నిల్వలలో చైనా, రష్యా కలిపి 14 శాతానికి పైగా కలిగి ఉన్నాయి. మొత్తం బ్రిక్స్ దేశాల వాటా దాదాపు 20 శాతంగా ఉంది. గృహాల్లో ఉన్న బంగారాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే భారత్ వాటా అన్ని దేశాల కంటే ఎక్కువగా ఉంటుంది. ఆర్థిక శక్తి మరియు ఆహార భద్రత: ప్రపంచ బ్యాంకు 2024 గణాంకాల ప్రకారం చైనా, భారత్, బ్రెజిల్, రష్యా ప్రపంచంలోని టాప్ 11 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఉన్నాయి. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా సుమారు 29 శాతంగా ఉంది. యుద్ధాలు లేదా ఆర్థిక సంక్షోభాల సమయంలో ఆహార స్వయంసమృద్ధి అనేది దేశాలను కాపాడుతుంది. ప్రపంచ ఆహార ఉత్పత్తిలో దాదాపు సగానికి పైగా బ్రిక్స్ దేశాలదే వాటా. చైనా 24 శాతం, భారత్ 12 శాతం ఉత్పత్తిని కలిగి ఉన్నాయి. భారత్ నాయకత్వం – భవిష్యత్తు వ్యూహాలు: డొనాల్డ్ ట్రంప్ పన్ను విధానాల నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు తమ మధ్య సహకారాన్ని పెంచుకుంటున్నాయి. ముఖ్యంగా భారత్ మరియు రష్యాలు మరింత సన్నిహితమయ్యాయి. ఇలాంటి కీలక తరుణంలో భారత్ బ్రిక్స్ భద్రతా మండలి బాధ్యతలు స్వీకరించడం అనేది అంతర్జాతీయ మార్కెట్లలో పెను మార్పులకు సంకేతంగా మారుతోంది. ఇది బంగారం ధరలు పెరగడానికి కూడా ఒక కారణం కావచ్చు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## చందనం మార్కెట్ లో భారత్ కు ఏమైంది?

ఎర్ర చందనంపై 'పుష్ప'ల ప్రభావం ఓ రేంజ్ లో ఉందని అంటారు. ఇదే క్రమంలో చందన మార్కెట్ లో భారత ప్రాభవం కోల్పోయినట్లు కేంద్ర ప్రభుత్వం నియమించిన శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ తన నివేదికలో పేర్కొంది. దీనికి గల ప్రధాన కారణం ఈ వృక్షజాతిని విపరీతంగా నరికేయడమేనని అంటున్నారు. ఫలితంగా మేలురకం జాతులు అంతరించిపోతున్నాయని చెబుతున్నారు. అవును... దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో అత్యధికంగా పెరిగే చందనం మొక్కలను విపరీతంగా నరికేయడం వల్ల మేలురకం జన్యురకాలు అంతరించి, నాసిరకం జాతులు మిగిలినట్లు శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ వెల్లడించింది. ఒకవైపు సరఫరా తగ్గి, అంతర్జాతీయ మార్కెట్ లో చందనానికి డిమాండ్ విపరీతంగా పెరిగిందని పేర్కొంది. ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా చందనం మార్కెట్ లో ఓ వెలుగు వెలిగిన భారత ప్రభావాన్ని పునరుద్ధరించాలంటే, మన ప్రభుత్వాలు జోక్యం చేసుకుని దేశంలో చందన మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని కమిటీ సూచించింది. ప్రస్తుతం ఆస్ట్రేలియా కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా 70% మార్కెట్ వాటాను గుప్పిట్లో ఉంచుకున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. వాస్తవానికి ఒకప్పుడు ప్రధాన చందన తైలం ఉత్పత్తిదారుగా ఉన్న భారత్.. క్రమంగా భారీ దిగుమతిదారుగా మారింది. తాజా ఘణాంకాలు ఆ పరిస్థితిని క్లియర్ గా చూపిస్తున్నాయి. ఇందులో భాగంగా... 2023-24లో మనదేశం నుంచి 0.62 మిలియన్ డాలర్ల విలువైన చందనం ఎగుమతి జరిగితే దిగుమతులు మాత్రం 5.59 మిలియన్ డాలర్లు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా చందన మార్కెట్ విస్తరిస్తోంది. ఇందులో భాగంగా... 2023లో 265.8 మిలియన్ డాలర్ల మేర ఉన్న ఈ మార్కెట్, 2030 నాటికి 502.2 మిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉంది. ఈ ఏడేళ్లలో 9.4% మేర వార్షిక వృద్ధిరేటు నమోదు చేస్తుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని.. దేశంలో అమూల్యమైన ఈ వనరుపై దృష్టిసారించాలని చెబుతున్నారు! ఈ నేపథ్యంలో... కేంద్ర పర్యావరణ, అటవీశాఖ భారత అటవీచట్టం 1927ని సవరించి, పంట పొలాల్లో పెంచిన చందన మొక్కలను అటవీ ఉత్పత్తుల నుంచి తొలగించాలని.. ఆర్థిక సంస్థలు ఈ మొక్కల పెంపకానికి అవసరమైన రుణాలు ఇవ్వడంతో పాటు, బీమా సౌకర్యం కల్పించాలని, అన్నిరకాల ప్రోత్సాహకాలు అందించాలని కోరుతున్నారు. ఇదే క్రమంలో... చందన మొక్కల పెంపకం కోసం సంస్థాగతంగా రుణ సౌకర్యం, ప్రోత్సాహకాలు, బీమా సౌకర్యం కల్పించేందుకు కేంద్ర పర్యావరణం, అటవీ, ఆయుష్ మంత్రిత్వశాఖలు చర్యలు తీసుకోవాలని.. అన్ని రాష్ట్రాల్లో ఒకే విధానం అమలయ్యేలా చూడాలని చెబుతున్నారు. వాస్తవానికి.. చందనం చెట్లు ప్రధానంగా కర్ణాటక, కేరళ, తమిళనాడుల్లో ఎక్కువగా పెరుగుతాయి. అయితే.. ఈ వనరుకున్న ప్రాధాన్యాన్ని గుర్తించకుండా విపరీతంగా కొట్టేయడంతో నాణ్యమైన జాతులన్నీ అంతరించిపోయి, నాసిరకం సరుకు మిగిలిపోయింది. ఈ లోపాన్ని అధిగమించాలంటే మళ్లీ మేలురకం మొక్కల పెంపకంపై దృష్టిసారించాలని సూచిస్తున్నారు. దీనికోసం ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని అంటున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో చాలా ప్రైవేటు సంస్థలు, సంఘాలు, రైతులు వాణిజ్యపరంగా పెద్దసంఖ్యలో మొక్కల పెంపకం చేపట్టారు. దీనివల్ల పంటపొలాల్లో ఈ మొక్కల పెంపకం 30,000 హెక్టార్ల దాకా చేరే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం మాజీ ఐఏఎస్ అధికారి రతన్ పి.వాటాల్ నేతృత్వంలో శాండల్ వుడ్ డెవలప్మెంట్ కమిటీ ఏర్పాటుచేసింది. ఆ కమిటీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితులన్నింటినీ సమీక్షించి ఇప్పుడున్న విధానాలు, న్యాయపరమైన నిబంధనావళిలో మార్పులు సూచిస్తూ సిఫార్సులు చేసింది.

# సఖ్యత.. ఐక్యత.. పల్లెభవిత




మెదక్: ఈ పరిస్థితులు పల్లె ప్రగతికి అవరోధం కానున్నాయి. సర్పంచులే రథసారథులుగా పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలి. అభివృద్ధికి కృషి చేస్తూ, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలి. బాధ్యతలు, విధుల నిర్వహణలో పారదర్శకత పాటించాలి. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలి. అధికారులు, పాలకవర్గ సభ్యులు, కార్యదర్శులతో సమన్వయంగా సాగితేనే ఫలితం ఉంటుంది.

**వార్డుసభ్యుల మద్దతు**

గ్రామాభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు కార్యరూపంలోకి రావాలంటే పంచాయతీ పాలకవర్గ సమావేశ తీర్మానం తప్పనిసరి. ఇందుకు వార్డుసభ్యుల మద్దతు అవసరం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన నిధులు వినియోగించేందుకు పాలకవర్గ తీర్మానంతో పాటు పనుల కమిటీ నియామకం చేపట్టాలి.

**కార్యదర్శుల ముఖ్యభూమిక**

నూతన పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం పంచాయతీలో కార్యదర్శి ముఖ్యభూమిక పోషిస్తున్నారు. సర్పంచి, కార్యదర్శి మధ్య సమన్వయం ఉంటేనే పాలన పరుగులు పెట్టనుంది. ఘర్షణ వాతావరణం ఉంటే అధికారులకు ఇబ్బందికరం.

**అందరినీ కలుపుకొని**

కార్యదర్శితో సఖ్యతగా మెలిగితేనే ప్రభుత్వం నిర్దేశించిన పనులు గడువులోగా పూర్తికానున్నాయి. నిధుల సమీకరణ సులువు అవుతుంది.

గ్రామ పరిపాలనాధికారి(జీపీవో) వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈవో)తో పాటు అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందితో పాటు ఉపాధ్యాయలు, ఇతర విభాగాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సర్పంచి ముందుకు సాగాలి.

గ్రామ స్వరాజ్యం సాధనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమైంది. ఈ వ్యవస్థకు దిశానిర్దేశం చేసేది ప్రజాప్రతినిధులు. అధికారులతో సమన్వయం, ఆర్థిక స్వావలంబన ఉన్నప్పుడే గ్రామీణాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుంది. - మహాత్మా గాంధీ

పార్టీలకు అతీతంగా పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీల జోక్యం పెరిగిపోయింది. వార్డుసభ్యుడి నుంచి మొదలుకొని సర్పంచి వరకు ప్రతి ఒక్కరు ఏదో రాజకీయపార్టీ మద్దతు తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

సంగారెడ్డి జిల్లా కంది మండలం కాశీపూర్, కొండాపూర్ మండలం అనంతసాగర్‌లో పాలకవర్గాల సభ్యుల ప్రమాణ స్వీకారం సైతం వేర్వేరుగా చేయడమే ఇందుకు నిదర్శనం.

ఇదే మాదిరిగా ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో వార్డుసభ్యులు వర్గాలుగా విడిపోయిన ఘటనలు ఉన్నాయి. పలు గ్రామాల్లో సర్పంచులు అధికార పార్టీ మద్దతుదారులమని తాము చెప్పినట్లు కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు నడుచుకోవాలని హెచ్చరికలు జారీచేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల మద్దతుదారులైన కొందరు సర్పంచులు కార్యదర్శులు తమ ఆధ్వర్యంలోనే విధులు నిర్వహించాలంటున్నారు.

# అడిగేవారేరి.. అంతా మా ఇష్టం..!



మధిర : జిల్లాలోని వివిధ గ్రామాలు, మండల కేంద్రాల్లో దుకాణాలు, వ్యాపార సముదాయాలు ఉన్నప్పటికీ ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్సుల సంఖ్య మాత్రం పెరగటం లేదు. పంచాయతీల ఆదాయానికి గండి పడుతోంది. పెద్ద పంచాయతీల్లో, మండల కేంద్రాల్లో ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాలపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తే పంచాయతీలకు ఆదాయం సమకూరే అవకాశాలు మెరుగుపడతాయి.

**పంచాయతీల ఆదాయం కరవు..**

జిల్లాలో 20 మండలాల్లో 571 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీలకు కళ్లేదుటే ఆదాయ మార్గాలున్నా.. అధికారులు వాటిపై దృష్టి కేంద్రీకరించటంలేదు. దీనిపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద పంచాయతీలు, మండల కేంద్రాల్లో ఇళ్లలో నిర్వహిస్తున్న దుకాణాల నుంచి పూర్తిస్థాయిలో ట్రేడ్ లైసెన్స్‌లు వసూలు చేయటం లేదు. గృహాల్లోనే వివిధ వ్యాపారాలు సాగిస్తున్నారు. కొందరు ఇప్పటికీ గృహావసరాల దుకాణాల పేరుతోనే పన్నులు చెల్లిస్తున్నారు. అందుకే పంచాయతీలకు ఆదాయం తగ్గుతోంది. గ్రామాల్లో వ్యాపారాలు కొనసాగించేవారు ట్రేడ్ లైసెన్సులు తీసుకుంటే ఆయా పంచాయతీలకు ఆర్థిక వనరులు సమకూరుతాయి. ప్రగతికి ఊతమవుతాయి. అంతేగాక లైసెన్సులు పొందితే ఆయా వ్యాపారులకు ప్రభుత్వ పథకాల ద్వారా మరింత ఆర్థిక భరోసా దక్కనుంది. ఆధ్యాత్మిక క్షేత్రాలు ఉన్న గ్రామాల్లో సైతం తక్కువ సంఖ్యలోనే ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకుంటున్నారు. ఆలయాల పరిసర ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నా కొందరు అనుమతులు తీసుకోవటం లేదు.

తెలంగాణ చిన తిరుపతిగా పేరొందిన జమలాపురం పుణ్యక్షేత్రంలో వందల కొద్దీ దుకాణాలు నిర్వహిస్తున్నా కొందరే లైసెన్సులు పొందారు. తెలుగు రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది మంది భక్తులు ఆలయానికి వస్తుంటారు. వ్యాపార లావాదేవీలు రూ.లక్షల్లోనే సాగుతుంటాయి. ప్రతి ఒక్కరూ లైసెన్సులు తీసుకుంటే ఇక్కడి పంచాయతీకి ఆదాయం మెరుగుపడి అభివృద్ధి పనులకు ఖర్చుచేసే అవకాశం ఉంటుంది.

కొన్ని గ్రామాల్లో కొందరు తమ ఇళ్ల ముందు దుకాణాలకు గదులు నిర్మించి వ్యాపారానికి అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. అయినా ఇంటికే పన్నులు చెల్లిస్తున్నారు. ఇటీవల కొంతకాలంగా గ్రామాల్లో ట్రేడ్ లైసెన్స్‌లపై అధికారులు దృష్టి సారించారు. ఇది పూర్తి స్థాయిలో అమలైతే ఆదాయం సమకూరుతుంది.

మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు పంచాయతీల్లోనూ వ్యాపారాలు నిర్వహించే దుకాణదారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలి. తద్వారా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయి. చిరు వ్యాపారులకు భరోసాగా ఉంటుంది. గ్రామాల్లో ఆదాయం సమకూరి అభివృద్ధికి తోడ్పాటుగా నిలుస్తుంది. ఎవరైనా లైసెన్సులు తీసుకోకుండా వ్యాపారాలు కొనసాగిస్తుంటే ఆయా దుకాణాలను సీజ్ చేస్తాం.

ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

# 'నడిపేవారు' లేక నిలిపేశారు!



నర్సాపూర్: నర్సాపూర్ డిపోలో డ్రైవర్ల కొరత వేధిస్తోంది. ప్రస్తుతమున్న బస్‌లకే సరిపోవడం లేదు. మరికొద్ది రోజుల్లో కొత్తగా బస్సులు వచ్చే అవకాశం ఉంది. వాటిని ఎలా నడపాలో అర్థం కాక ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న వారిపై అదనపు భారం మోపుతున్నారు. నర్సాపూర్‌లో డిపోను మూడేళ్ల క్రితం ప్రారంభించారు. 27 సంస్థ సర్వీసులు(ఇవన్నీ పల్లెవెలుగులే), 3 అద్దెవి(నిర్వాహకుల చోదకులే) ఉన్నాయి. వీటికి సంస్థ పరంగా కండక్టర్లు ఉంటారు. డిపో ప్రారంభంలో అన్నీ పాత డొక్కు బస్సులనే అందుబాటులో ఉంచగా అవి క్రమంగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని తొలగిస్తూ 15 వరకు కొత్తవి పంపారు. దీంతో మొత్తం 27 బస్సులున్నాయి. వీటిని నడిపేందుకు 36 మంది డ్రైవర్లున్నారు. ఇద్దరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. మిగిలింది 34 మంది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా 44 మంది అవసరం ఉండగా ఇంకా 10 మంది తక్కువగా ఉన్నారు. ఉన్న వారిలో ఎవరైనా ఆరోగ్య సమస్యలతో రాకపోతే ఆ రోజు బస్సులు డిపోకే పరిమితం అవుతాయి. దీంతో ఎక్కువగా నర్సాపూర్-బాలనగర్, నర్సాపూర్-జోగిపేట, నర్సాపూర్-పటాన్‌చెరుకు వెళ్లే ప్రయాణికులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పవు. బస్సుకు ముగ్గురు చోదకులు అందుబాటులో ఉండాలన్న నిబంధన కనిపించడం లేదని విమర్శలున్నాయి. అప్పుడప్పుడు ఉన్న వారికే అదనంగా డ్యూటీలు వేస్తూ నెట్టుకొస్తున్నారు.

**ఉన్నవారితోనే సర్దుబాటు చేస్తున్నాం**

డ్రైవర్ల కొరత ఉందని ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం ఉన్న వారితోనే సర్దుబాటు చేస్తున్నాం. కొత్తగా నియామకం జరిగితేనే సమస్యలు తీరుతాయి. వారంతపు సెలవుల్లో ఉన్నవారికి అదనపు డ్యూటీలు వేస్తున్నాం. ఇందుకు అదనంగా చెల్లిస్తున్నాం. డ్రైవర్లపై పనిభారం పడుతున్నది వాస్తవమే. ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపడుతున్నాం. హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారికి అవకాశం ఇస్తున్నాం.

లక్ష్మణ్, డిపో పర్యవేక్షకులు

# ఆరుబయట వాహనం.. సెల్లార్‌లో వ్యాపారం!

సూర్యాపేట: జిల్లాలోని పురపాలికల్లో సెల్లార్లు వ్యాపార నిలయంగా మారాయి. వాటిలో వాహనాలను నిలుపుకొనే వెసులుబాటు కల్పించాలి. ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్, దస్తులు, మెకానిక్, తదితర వాటికి ఉపయోగిస్తున్నారు. ఆసుపత్రి నిర్వాహకులు మాత్రం ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లకు వాడుకుంటున్నారు. దీంతో వాహనదారులు తమ వాహనాలను ఆరుబయటే నిలుపుతున్నారు. జిల్లాలోని ఐదు పురపాలికల్లో 42 వరకు సెల్లార్లున్నాయి. వీటిలో అత్యధికం దుకాణాలు నిర్వహిస్తున్నారు. అందులో ఎవరూ వాహనాలను నిలపడం లేదు. కొందరు నిర్వాహకులు సామగ్రి ఉంచి తాళం వేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు..**

పుర అధికారులు పట్టించుకోకపోవడంతో సెల్లార్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిర్మాణ సమయంలో అధికారులకు మామూళ్లు ఇవ్వడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని



ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వారు ఆడిందే ఆట.. పాడింతే పాటగా వాటిని వినియోగిస్తున్నారు. ఆరుబయట వాహనాల కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. పట్టణాలు రోజురోజుకు విస్తరిస్తుండటంతో వాహనాల వినియోగం పెరిగింది. వివిధ అవసరాల నిమిత్తం చుట్టుపక్కల గ్రామాలవారు తరచూ పట్టణాలకు వస్తుంటారు. ఈ కారణంగా వాహనాలు మళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**చర్యలు తీసుకుంటాం: హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట**

నిర్వాహకులు తమ సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. వాటిని వాహనాల పార్కింగ్‌కే వినియోగించాలి. తనిఖీలు చేపట్టి వ్యాపారాలు చేయకుండా చూస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే శాఖాపరంగా చర్యలు చేపడతాం.

# బల్క్ కనెక్షన్ల ఆదాయం పెంచుకుందాం

హైదరాబాద్ : జలమండలికి అత్యధిక రాబడిని ఇస్తున్న బల్క్ నీటి కనెక్షన్ల నుంచి ఆదాయాన్ని మరింత పెంచుకునేలా కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రస్తుతం సుమారు రూ.77 కోట్లు నెలకు బల్క్ కనెక్షన్ల నుంచి రాబడి వస్తుండగా దీన్ని రూ.100 కోట్లకు పెంచేలా దృష్టిసారించింది. జలమండలికి ఆదాయంలో కీలకంగా ఉన్న బల్క్‌కనెక్షన్లు 72 వేలు దాకా ఉన్నాయి. బల్క్ కనెక్షన్లలో బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీలు, హైరైజ్ భవనాలతో పాటు వివిధ సంస్థలు ఉన్నాయి. ప్రతినెలా జలమండలికి రూ.130 కోట్లు రాబడి వస్తుండగా ఇందులో అత్యధిక శాతం వాటి నుంచే వస్తోంది. జలమండలికి 14.2 లక్షల కనెక్షన్లు ఉన్నా రాబడి వచ్చే కనెక్షన్లు



1.25 లక్షలు మాత్రమే ఉన్నాయి. సుమారు 8 లక్షల కనెక్షన్లు ఉచిత కనెక్షన్లుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అత్యధిక రాబడిని ఇచ్చే కనెక్షన్లను పెంచుకోవడం, ఉన్న కనెక్షన్లకు నికరంగా నీటిని సరఫరా చేసి ఆదాయాన్ని సమకూర్చుకోవడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి బల్క్ కనెక్షన్‌లపై ప్రత్యేక సమీక్ష చేస్తున్నారు. బల్క్ కనెక్షన్ల నుంచి నీటి వినియోగ ఛార్జీలను కచ్చితంగా వసూలు చేసేలా జనరల్ మేనేజర్ల నుంచి మేనేజర్ల దాకా బాధ్యతలు అప్పగించారు. లక్ష్యం మేరకు ఛార్జీలు వసూలు చేస్తేనే వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉందని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. గతంలో ఉదాసీనంగా వ్యవహరించడంతో రూ.1700 కోట్లదాకా బకాయిలు ఉన్నాయి. అత్యధికం ప్రభుత్వరంగ సంస్థలతో పాటు ప్రైవేటు సంస్థలు ఉన్నాయి.

# సరళం.. పారదర్శకం

హైదరాబాద్: హెచ్‌ఎండీఏ పరిధిలోని భూ వినియోగ మార్పిడి(సీఎల్‌యూ) ప్రక్రియ ఇక వేగవంతం కానుంది. పారదర్శకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం తాజాగా జీవో వెలువరించింది. ఇప్పటివరకు సీఎల్‌యూ దరఖాస్తులను మ్యానువల్‌గా సమర్పించేవారు. ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే స్వీకరించనుంది. మాస్టర్‌ప్లాన్‌లో ఒక అవసరం కోసం కేటాయించిన భూమిని వేరే వినియోగానికి వాడే సందర్భంలో చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) తప్పనిసరి. హెచ్‌ఎండీఏకు దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రత్యేక జీవోతో మాస్టర్‌ప్లాన్‌లో ఆ మేరకు భూ వినియోగ మార్పిడికి అంగీకరిస్తుంది.

సీఎల్‌యూలో మార్పులు ఇలా..ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరించే సమయంలోనే హెచ్‌ఎండీఏ/టౌన్ అండ్ కంట్రి ప్లానింగ్(డీటీసీపీ), అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ ప్రాసెసింగ్, ఇతర రుసుములు వసూలు చేయాలి దరఖాస్తుతో పాటు తాజా పరిస్థితిని పూర్తి వివరాలతో దస్త్రం ప్రభుత్వం ముందుంచాలి. హెచ్‌ఎండీఏ లేదా ఇతర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల నుంచి వచ్చిన సీఎల్‌యూ ప్రతిపాదనలను, 2014లో ఏర్పాటైన సీఎల్‌యూ కమిటీలు పరిశీలించి తర్వాతనే ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తారు. కమిటీ సూచనల మేరకు, సంబంధిత మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి మంత్రి ఆమోదం పొందిన తర్వాతే ప్రభుత్వం ఆమోదం లేదా తిరస్కరణపై తుది నిర్ణయం తీసుకుంటుంది.

అభ్యంతరాలు రాకపోతే కన్వర్షన్ ఛార్జీలు వసూలు చేసి, వివరాలు ప్రభుత్వానికి పంపాలి. అభ్యంతరాలు వస్తే వాటిని పరిశీలించి ఆ వివరాలతో నివేదికతో సర్కారుకు తిరిగి తీర్మానాన్ని పంపాలి.

కన్వర్షన్ ఛార్జీలు వసూలు చేసిన తర్వాత ప్రభుత్వం సీఎల్‌యూపై తుది ఉత్తర్వులు జాచేస్తుంది. ఆమోదించిన భూ వినియోగ మార్పులను మాస్టర్‌ప్లాన్‌లో అనుసంధానించేందుకు ఆదేశాలు జారీ చేస్తుంది.

# కాలువల్లో సాగునీరెలా పారేది!

సారంగాపూర్ : ఉపాధిహామీ పథకంలో ఒక్క సారంగాపూర్ మండలంలోనే సాగునీటి కాలువల పూడికతీతతో 3 వేల మంది కూలీలకు పని దొరికేది. కనీసం 10 గ్రామాల్లో చెరువుల పూడికతీత పనులు చేపడితే 20 వేల మందికి కూలీ దొరికేది. ఈ రెండు పనులతో ఒక్క మండలంలోనే ఏటా రూ.1.5 కోట్ల వరకు వేతన రూపంలో కూలీలకు చెల్లించేవారు.

**శాశ్వత పనులకే ప్రాధాన్యం**

కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరును 'వీబీ జీ రామ్ జీ(వికసిత్ భారత్ గ్యారంటీ రోజ్‌గార్ అజీవికా మిషన్ గ్రామీణ్)'గా మార్చింది. దీంతో పాటు పథకంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. ఉపాధిహామీలో ఏడాది కాలంగా కాలువల్లో పూడికతీత, కందకాల తవ్వకం, చెరువుల పూడికతీత తదితర పనులను నిలిపేశారు. నూతన చట్టంలో జల భద్రత, మౌలిక వసతుల కల్పన, జీవనోపాధి సృష్టి, వాతావరణ మార్పులను తట్టుకొని నిలిచే పనులకు ప్రాధాన్యమివ్వనున్నారు. జగిత్యాల జిల్లా పూర్తిగా ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతం కావడంతో ఏటా ఉపాధిహామీలో కాలువల్లో పూడికతీత పనులు పెద్ద ఎత్తున జరుగుతుండేవి.

జిల్లావ్యాప్తంగా దాదాపు 87 కిలోమీటర్ల మేర కాకతీయ కాలువ, డీ–29 నుంచి డీ–83 డిస్ట్రిబ్యూటరు కాలువలు 232 కిలోమీటర్ల దూరం ఉన్నాయి. అలాగే 137 మైనర్ కాలువలు 468 కిలోమీటర్లు,



126 సబ్ మైనర్ కాలువలు 280 కిలోమీటర్ల పొడవున్నాయి. వీటితో పాటు గ్రామాల్లో పంట పొలాలకు అదనంగా ఫీడర్ కాలువలుంటాయి. ఏటా ఉపాధిహామీలో కూలీలతో వీటిలో పూడికతీత పనులు చేపట్టేవారు. పదేళ్లుగా ఎస్సారెస్పీ కాలువల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. కొత్త చట్టంలో పూడికతీత పనులు లేకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లనుంది.

**కొత్త కార్డులిస్తేనే ప్రయోజనం**

ఇప్పటివరకు ఏటా 100 పని దినాలుండగా 125 రోజులకు పెంచారు. కాగా వ్యవసాయ సీజన్‌లో పనులు నిలిపేయనుండటంతో ఏడాదికి లక్ష్యం చేరుకోవడం కష్టమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండేళ్లుగా కొత్త జాబ్ కార్డుల మంజూరు లేకపోవడంతో కుటుంబాలు విడిపోయినప్పటికీ 100 రోజులే పని కల్పిస్తుండటంతో సరిపోవడం లేదు. పెంచిన పని దినాలతో ఉమ్మడి జిల్లాలోని 4,58,397 మంది క్రియాశీల కూలీలకు ప్రయోజనకరంగా మారినా కొత్త జాబ్‌కార్డులు జారీ చేస్తేనే ప్రయోజనం చేకూరనుంది. వేసవిలో కొలతల్లో సడలింపు, ఫిబ్రవరి నుంచి జూన్ వరకు అదనపు భత్యం చెల్లింపు అమలు చేసేవారు. నాలుగైదేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. కొత్త చట్టంలోనైనా లోటుపాట్లు సవరిస్తే కూలీకు మేలు చేకూరనుంది.

# ఉపాధి వల.. విదేశాల్లో విలవిల

జగిత్యాల : సామాజిక మాధ్యమాల్లో ఉద్యోగ ప్రకటనలు చూసి నిరుద్యోగులు మోసపోతున్నారు. ఏజెంట్ల మాటలు నమ్మి కటకటాలపాలవుతున్నారు. ఇటీవలి కాలంలో జిల్లాలో వరుస ఘటనలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. జిల్లాకు చెందిన కొందరు అనధికార ఏజెంట్లు యూరప్ దేశాల్లో అధిక వేతనాల ఆశ చూపి యువత నుంచి రూ.5 నుంచి 8 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. అనంతరం సందర్శక వీసాలతో థాయ్‌లాండ్ పంపుతున్నారు. అక్కడికి వెళ్లాక సైబర్ ముఠాలకు అప్పగిస్తున్నారు. ఇటీవల ముగ్గురు యువకులు ఇలాగే మోసపోయారు. మయన్మార్‌లో



చిక్కుకుపోయిన తెలుగు రాష్ట్రాలకు చెందిన 74 మందిని దాదాపు నెల రోజుల కిందట ఆర్మీ సహకారంతో స్వదేశానికి తీసుకొచ్చారు. అందులో జిల్లాకు చెందిన ముగ్గురు బాధితులున్నారు.

ఈ ఏడాది జనవరిలో మయన్మార్, కంబోడియాల్లో సైబర్ స్థావరాలపై దాడులు జరిపిన పోలీసులు సుమారు 530 మందిని పట్టుకున్నారు. అందులో 26 మంది తెలుగు రాష్ట్రాలకు చెందినవారే.

గత మార్చిలో జిల్లాకు చెందిన అయిదుగురు యువకులను సందర్శక వీసాపై థాయ్‌లాండ్ పంపించారు. అక్కడి నుంచి కంబోడియాకు తరలించి సైబర్ నేరాలకు పాల్పడేలా ఒత్తిడి చేయడంతో బాధితులు తప్పించుకొని వచ్చారు. ఈ కేసులో జిల్లాకు చెందిన ఇద్దరు ఏజెంట్లు అరెస్టయ్యారు.

**మూడు దేశాల్లో నేరాలు**

థాయ్‌లాండ్ నుంచి లావోస్, మయన్మార్, కంబోడియా దేశాల్లోని సైబర్ స్థావరాలకు వలసజీవులను పంపిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో పలుమార్లు దాడులు నిర్వహించి బాధితులను విడిపించారు. సైబర్ నేరాలు చేయడానికి ఒప్పుకోకుంటే కఠినంగా శిక్షిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. థాయ్‌లాండ్ వరకు సందర్శక వీసాలపై తీసుకెళ్లి అనధికారికంగా సైబర్ స్థావరాలకు తరలించి ఓ ప్రాంతంలో భారీ బందోబస్తు మధ్య సైబర్ నేరాలు చేయిస్తున్నారని ఇటీవల వచ్చిన బాధితులు తెలిపారు.

**పోలీసుల అవగాహన**

సైబర్ మోసాలపై ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు కళా బృందాలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాయి. ప్రభుత్వ టామ్‌కామ్ లేదా గుర్తింపు పొందిన ఏజెన్సీల ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లాలని, అధిక వేతనంపై ఆశతో సైబర్ ముఠాలకు చిక్కొద్దని సూచిస్తున్నాయి.

**లైసెన్సుడ్ ఏజెంట్లనే సంప్రదించాలి**

ఆన్‌లైన్‌లో వచ్చే ఉద్యోగ ప్రకటనలను నమ్మొద్దు. గత వారం ఇలాంటి మోసాన్ని బయటపెట్టి నిందితుడిని అరెస్టు చేశాం. నకిలీ ఏజెంట్లు మాయమాటలతో మోసగిస్తున్నారు. మొదట ఏజెంట్లుగా చెప్పుకొనే వారికి లైసెన్స్ ఉందో? లేదో? తెలుసుకోవాలి. గతంలో ఎంత మందికి ఉద్యోగాలిప్పించారో ఆరా తీయాలి. ఒకటికి రెండు సార్లు పరిశీలించాకే నిర్ణయం తీసుకోవాలి. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. రఘుచందర్, జగిత్యాల డీఎస్పీ

# మైజీహెచ్‌ఎంసీ యాప్




హైదరాబాద్ : డివిజన్ల పునర్విభజన పూర్తవడంతో.. శివారు ప్రాంతాలకు పౌర సేవలు చేరువ చేయడంపై జీహెచ్‌ఎంసీ దృష్టిపెట్టింది. అందులో భాగంగా 'మైజీహెచ్‌ఎంసీ' యాప్‌ను ఐటీ విభాగం బలోపేతం చేస్తోంది. శివారు అవసరాలకు తగ్గట్టుగా.. చేర్పులు, మార్పులు చేస్తోంది. ఇప్పటికే ప్రాథమిక సమస్యలపై ఫిర్యాదు చేసేట్లు మార్పులు చేశామని, త్వరలోనే ఆస్తిపన్ను చెల్లింపులు, ఇతర పౌర సేవలన్నింటినీ విస్తరిస్తామని కమిషనర్ ఆర్వీ.కర్ణన్ ధీమా వ్యక్తం చేశారు.

**వివరాల నమోదు..:** ప్రస్తుతం యాప్‌లో పాత జీహెచ్‌ఎంసీలోని 150 డివిజన్ల వివరాలు మాత్రమే స్పష్టంగా ఉన్నాయి. విలీనమైన 27 స్థానిక సంస్థల పేర్లను తాజాగా నమోదు చేశారు. ఆయా పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే.. ఆ సమాచారం నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు చేరుతుంది. మున్ముందు.. ఫిర్యాదులను మున్సిపల్ కమిషనర్‌తోపాటు, బాధ్యుడైన అధికారికి చేరేట్లు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కొత్త డివిజన్ల హద్దులను జియో ఫెన్సింగ్ చేయాల్సి ఉందని వెల్లడించారు.

**ఈ ఫిర్యాదులు చేయొచ్చు**

ఇంజినీరింగ్(రోడ్లపై గుంతలు, మ్యాన్‌హోళ్ల సమస్యలు ఇతర), ఎలక్ట్రికల్(వీధి దీపాలు, ఇతర), ఫుడ్‌సేఫ్టీ(ఆహార కల్తీ, నాసిరకం వంటకాలు), ఎంటమాలజీ(దోమల సమస్య, చెరువుల్లో గుర్రపుడెక్క), వెటర్నరీ(వీధి కుక్కలు), టౌన్‌ప్లానింగ్(నిర్మాణ అనుమతులతో ముడిపడిన సమస్యలు), అర్బన్‌బయోడైవర్సిటీ(పచ్చదనానికి సంబంధించి), అడ్వర్టైజ్‌మెంట్(హోర్డింగులు, ఫ్లెక్సీలు), ఎస్టేట్స్ (బల్దియా మార్కెట్లు, కాంప్లెక్సుల్లోని దుకాణాలఅన్యాక్రాంతం, ఆక్రమణలు), రెవెన్యూ (రెవెన్యూ, ట్రేడ్ లైసెన్సులు), ఎన్నికలు(ఓటరు దరఖాస్తులు, ఓట్ల తొలగింపు) ఐటీ(యాప్, వెబ్‌సైట్‌లు పనిచేయకపోవడం, ఇతర సాంకేతిక సమస్యలు), పార్కింగ్(రోడ్లపై అక్రమ పార్కింగ్, సెల్లారు దుర్వినియోగం, ఇతర), చెరువులు(చెరువులు, నాలాల ఆక్రమణ, పూడిక సమస్య), పారిశుద్ధ్యం, ఆరోగ్యం(జనన, మరణ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు), ట్రేడ్‌లైసెన్స్(వ్యాపార ధ్రువీకరణపత్రం) సేవలు పొందడంలో తలెత్తే సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు. గూగుల్‌ప్లేస్టోర్, ఐఓసీ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది.

# పైరవీలు.. ప్రదక్షిణలు




హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ప్రణాళిక విభాగంలోని అధికారులు బల్దియా వైపు చూస్తున్నారు. తాజాగా అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలోని దాదాపు 27 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు బల్దియాలో చేరిన నేపథ్యంలో గతంలో డిప్యూటేషన్‌పై హెచ్‌ఎండీఏకు వచ్చిన వారంతా తిరిగి బల్దియాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటినుంచే తెలిసిన ఉన్నతాధికారులతో పైరవీలకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగంలో ఇద్దరు డైరెక్టర్లతోపాటు, చీఫ్ ప్లానింగ్ అధికారులు, ప్లానింగ్ అధికారులు, సహాయ ప్లానింగ్ అధికారులు కలిపి మొత్తం 31 మంది వరకు పనిచేస్తున్నారు. ఇప్పటివరకు చేతి నిండా పని ఉండటంతో ఉక్కిరిబిక్కిరి అయ్యే పరిస్థితి. హెచ్‌ఎండీఏకు ఆదాయం తీసుకొచ్చే ప్రధాన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు బల్దియా కిందికి వెళ్లడంతో ప్రణాళిక విభాగంపై ఒత్తిడి పూర్తిస్థాయిలో తగ్గనుంది. ప్రస్తుతం ఈ విభాగంలో 31 మంది పనిచేస్తుండగా.. ఇందులో 19 మంది వరకు గతంలో డిప్యూటేషన్‌పై వచ్చినవారే. ఇద్దరు డైరెక్టర్లు కూడా బల్దియా నుంచి వచ్చి హెచ్‌ఎండీఏలో సేవలందిస్తున్నారు.

ముందే పసిగట్టి: కొందరైతే ఇప్పటినుంచే పైరవీలు చేసుకుంటున్నట్లు హెచ్‌ఎండీఏలో ప్రచారం జరుగుతోంది. ఇటీవలే హెచ్‌ఎండీఏలో కొత్తగా మరో 3 వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని కలిపారు. భవిష్యత్తులో ఇక్కడ కార్యకలాపాలు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో తిరిగి వీరిని వెనక్కి పంపే అవకాశం లేదంటున్నారు. దీన్ని ముందే పసిగట్టిన కొందరు ఎలాగైనా వెనక్కి వెళ్లిపోవాలని పైరవీలకు తెర తీసినట్లు తెలుస్తోంది.

**చిరునామా మార్చుకునేందుకు సమాయత్తం**

హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగం మధ్యాహ్నం నుంచి దళారులతో కిటకిటలాడుతుంటుంది. సీపీవోలు, పీవోలు, ఏపీవోలు, డైరెక్టర్ ఛాంబర్ల వద్ద తిష్ఠ వేసి తమ దరఖాస్తు క్లియరెన్సు కోసం నానా తిప్పలు పడుతుంటారు. బిల్డ్ నౌలో దరఖాస్తు చేసుకున్నా సరే.. కొందరు అధికారులను, కిందిస్థాయి ఉద్యోగులను ప్రసన్నం చేసుకోనిదే దరఖాస్తులు ముందుకు కదలని పరిస్థితి. ఓఆర్‌ఆర్ వరకు నిర్మాణరంగం శరవేగంగా జరుగుతుండటంతో దరఖాస్తులు భారీగానే వస్తున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటికే లేఅవుట్లు, బిల్డింగ్ నిర్మాణ అనుమతుల ద్వారా రూ.700–800 కోట్ల ఆదాయం దాటింది. ఏటా ఇది రూ.1200 కోట్లు దాటుతుంది. హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయం ఉన్న స్వర్ణ జయంతి చుట్టూ ఉన్న కన్సల్టెన్సీల్లో ఎక్కువశాతం దళారుల కార్యాలయాలే. ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్న శివారు కార్పొరేషన్లు ఇక బల్దియా పరం కావడంతో వీరు సైతం చిరునామాలు మార్చుకునేందుకు సమాయత్తమవుతున్నారు.

# మూడుగా ముత్యాల నగరం!



హైదరాబాద్ : బృహత్ నగరం తాత్కాలికమే. రెండువేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఏర్పాటైన విశాల నగరం. త్వరలోనే మూడు భాగాలు కానుంది. గ్రేటర్ హైదరాబాద్ పాలకమండలి గడువు పూర్తయ్యాక.. విభజన ప్రక్రియ మొదలవుతుంది. ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం జోన్లు, సర్కిళ్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. మూసీకి దక్షిణం వైపున నాలుగు జోన్లు.. ఉత్తరాన 8 జోన్లు ఏర్పాటు చేసింది.

**నాలుగు జోన్లకో కార్పొరేషన్:** బాహ్య వలయ రహదారి(ఓఆర్‌ఆర్) వరకు ఉన్న ప్రాంతాలన్నింటినీ కలిపి రాష్ట్ర ప్రభుత్వం టీసీయూఆర్(తెలంగాణ అర్బన్ కోర్ రీజియన్)గా పేర్కొంది. రాజధానిలో పట్టణీకరణ శరవేగంగా జరుగుతున్నందున.. అన్ని ప్రాంతాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి.. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారు. మూసీకి దక్షిణాన ఉన్న నాలుగు జోన్ల వరకు జీహెచ్‌ఎంసీని పరిమితం చేసి.. ఉత్తరం వైపున భాగాన్ని రెండు మహానగరపాలక సంస్థలుగా ఏర్పాటు చేసే ఉద్దేశం ఉన్నట్లు సమాచారం. సైబరాబాద్, సికింద్రాబాద్ పేర్లతో ఆయా నగరపాలక సంస్థలను ఏర్పాటుచేయాలని ఇటీవల ముఖ్యమంత్రి వద్ద జరిగిన ఓ సమావేశంలో చర్చ జరగడం గమనార్హం.

**పాలకమండలి గడువు పూర్తయ్యాకే.. :** పాలకమండలి గడువు వచ్చే ఫిబ్రవరి 10తో ముగియనుంది. తర్వాత 300 డివిజన్లను మూడు భాగాలుగా చేసే ప్రక్రియ మొదలవుతుంది. మార్చి లేదా ఏప్రిల్‌లో ఎన్నికలు ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. జులై నాటికి నిర్వహించకపోతే.. 2027 వరకు జరిగే అవకాశం ఉండవని అధికారులు విశ్లేషిస్తున్నారు. జనగణన పూర్తవుతుందని, కొత్త జనాభా లెక్కల ప్రకారం.. పునర్విభజన చేపట్టి.. ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందంటున్నారు.

**4 వేల ఫిర్యాదుల తిరస్కరణ**

వంద.. రెండు వందలు కాదు.. ఏకంగా 4 వేలకుపైగా ఫిర్యాదులు బుట్టదాఖలయ్యాయి. డివిజన్లు పెంచండి.. హద్దులు మార్చండంటూ రాజకీయ నేతలు, శివారు ప్రాంత ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను జీహెచ్‌ఎంసీ నిర్మొహమాటంగా తిరస్కరించింది. అందులో 90 శాతం అర్జీలు వేర్వేరు రాజకీయ పార్టీల నేతలవి కావడం గమనార్హం. ముందుగా నిర్ణయించుకున్నట్లుగానే డివిజన్ల పునర్విభజనను పూర్తి చేశారనే విమర్శలొస్తున్నాయి. జనాభా, విస్తీర్ణం దృష్ట్యా సమతూకం పాటించలేదని గగ్గోలు పెడుతున్నారు.

**నిర్ణయం తీసుకున్నారిలా..**

వచ్చిన ఫిర్యాదులు: 5,935
పూర్తిగా పరిగణనలోకి తీసుకున్నవి: 1,127
కొంతమేర పరిగణించినవి: 516
తిరస్కరించినవి: 4,292 (మొత్తం ఫిర్యాదుల్లో 72.31 శాతం)


ప్రతిపాదిత జోన్లు.. డివిజన్లు

హైదరాబాద్
శంషాబాద్ : 17
రాజేంద్రనగర్ : 29
చార్మినార్ : 25
ఎల్బీనగర్ : 24

సైబరాబాద్
శేరిలింగంపల్లి : 26
ఖైరతాబాద్ : 25 గోల్కొండ : 26 కూకట్‌పల్లి : 23 సికింద్రాబాద్
సికింద్రాబాద్ : 28 కుత్బుల్లాపూర్ : 27
మల్కాజిగిరి : 26 ఉప్పల్ : 24

# తేట తెలుగు.. డిజిటలీకరణ వెలుగు

ధర్మపురి : తెలుగు పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ విధానంలో రూపొందించి స్ఫూర్తినింపుతున్నారు ధర్మపురికి చెందిన భాషోపాధ్యాయుడు డా.గొల్లపల్లి గణేశ్. ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఫ్లాట్ ప్యానెల్ టీవీలు అందించింది. అందుబాటులో వనరులు లేక చాలా చోట్ల ఇవి నిరుపయోగంగా మారాయి. ఈ సమస్యను అధిగమించడానికి గణేశ్ ఫ్లాట్ ప్యానెల్‌లో బోధనకు అనుకూలంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠ్యాంశాలను అందమైన బొమ్మలతో, పట్టికల చిత్రాలతో రూపొందించారు. కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో సాంకేతిక ఉపకరణాలను వినియోగించారు. బొమ్మలకు తగ్గట్టుగా ఆకర్షణీయమైన గొంతులు జత కలవడంతో పిల్లలకు సులభంగా



అర్థమవుతోంది. తెలుగు భాషపై ఆసక్తి పెరిగింది. గణేశ్ రూపొందించిన బోధనాభ్యసన సామగ్రిని రాష్ట్రంలోని పలువురు భాషా ఉపాధ్యాయులతో పాటు తెలుగు ఐచ్ఛికంగా పరీక్షలు రాసే ఉద్యోగార్థులు వినియోగిస్తున్నారు. దాదాపు నెల రోజుల కిందట ఎస్‌ఈఆర్‌టీ రాష్ట్ర పరిశీలకులు సులోచన, డీఈవో రామునాయక్‌లు ధర్మపురికి వచ్చినపుడు గణేశ్ బోధనా విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి ప్రశంసించారు. పాఠ్యాంశాల్లో పదో తరగతి ఉపవాచకానికి సంబంధించి రామాయణాన్ని చిత్రాలతో రూపొందించడం తెలుగు రాష్ట్రాల్లోని పలువురిని ఆకర్షించింది. పాఠ్యాంశాలే కాకుండా వ్యాకరణానికి సంబంధించిన సంధులు, సమాసాలు, అలంకారాలు, చంధస్సు, వాక్యాలు ఇందులో ఉన్నాయి. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి అంతర్జాలంలో తెలుగు భాషా సాహిత్యాలపై పరిశోధన(పీహెచ్‌డీ) చేసి పట్టా పొందిన గణేశ్ ఈ ఏడాది రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

# కష్టాలకు ఎదురీది.. బాధ్యతలు గుర్తెరిగి

రాజపేట : బేగంపేటకు చెందిన సరితను యాదగిరిగుట్ట మండలం బాహుపేట పంజాల భాస్కర్‌కు ఇచ్చి గత 20 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. ఇద్దరు అమ్మాయిలు, ఓ కుమారుడు జన్మించిన తదుపరి భర్త సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. చిన్నప్పటి నుంచి గారాబంగా పెరిగిన సరితకు ఒక్కసారిగా ముగ్గురు పిల్లల సంరక్షణతో పాటు కుటుంబ బాధ్యతలు మీద పడ్డాయి. పదో తరగతి చదువుకున్నప్పటికీ చేసేదేమీ లేక వ్యవసాయ కూలీగా, స్థానికంగా ఉపాధిహామీ పనికి వెళ్లి కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. కూలీ పనులు చేపడితే సంసారం గడవడం కష్టంగా ఉందని భావించిన సరిత కూరగాయల వ్యాపారానికి పూనుకుంది. ఆటో అద్దెకు తీసుకుని యాదగిరిగుట్ట, ఆలేరు, రాజపేట మండలాల్లోని



వార సంతలో కూరగాయలు విక్రయిస్తూ ఉపాధి పొందింది. ఆటో అద్దె రోజుకు రూ.వెయ్యి చెల్లిస్తుండటంతో వచ్చిన లాభం ఆటోకే వెళుతోంది. మిగులు లేదని భావించిన సరిత స్థానికంగా మహిళా సంఘంలో రుణం తీసుకుని తానే ఆటో కొనుగోలు చేసింది. సోదరుడు ఉపేంద్ర సాయంతో డ్రైవింగ్‌లో తర్ఫీదు పొందుతున్న క్రమంలో గాయాలపాలైంది. గాయాలను లెక్కచేయకుండా డ్రైవింగ్ నేర్చుకుని నాలుగేళ్లుగా ఆటో నడుపుకొంటూ తండ్రి సత్తయ్య సహకారంతో కూరగాయల వ్యాపారం చేపడుతోంది.

పెద్ద అమ్మాయి ఐశ్వర్య డిగ్రీ పూర్తిచేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. చిన్నమ్మాయి మనీష డిగ్రీ ద్వితీయ, బాబు నాగరాజు ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. పిల్లలను ఉన్నత స్థాయికి చేర్చడమే తన లక్ష్యమని చెబుతోంది సరిత.

# యువత చేతికి పల్లె పగ్గాలు!

ఖమ్మం : గ్రామ పంచాయతీ పాలనా పగ్గాలు యువత చేతికి చిక్కాయి. ఇటీవల ముగిసిన ఎన్నికల్లో సర్పంచులుగా గెలుపొందిన వారిలో ఎక్కువ మంది యువతీయువకులే ఉన్నారు. జిల్లాలో 31 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు వారు 389 మంది సర్పంచులుగా ఎన్నికవటం విశేషం. మొత్తం 566 గ్రామ పంచాయతీ సర్పంచి స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా 565 పంచాయతీల్లో సర్పంచులు ఎన్నికయ్యారు. ఏన్కూరు మండలం నూకాలంపాడు పంచాయతీలో సర్పంచి స్థానానికి ఎవరూ నామపత్రాలు దాఖలు చేయనందున ఎన్నిక జరగలేదు. నామపత్రాల్లో దాఖలు చేసిన వివరాల మేరకు గెలుపొందిన సర్పంచుల వయసులు విభజించగా ఎక్కువ మంది యువతే ఉన్నారు. యువత చేతికి పాలనా పగ్గాలు దక్కటంతో పల్లెప్రజలకు సత్వర సేవలు అందుతాయని, అభివృద్ధి వేగవంతమవుతుందని పలువురు ఆశిస్తున్నారు. సర్పంచుల్లో ఎక్కువ మంది విద్యాధికులు కావటం గమనార్హం. పదోతరగతి నుంచి డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్ వరకు చదువుకున్నవారు సర్పంచులుగా ఎన్నికయ్యారు. కొందరు నిరక్షరాస్యులూ ఉన్నారు.

గూదె పుష్పావతి 34ఏళ్ల వయసులో కొణిజర్ల సర్పంచిగా ఎన్నికయ్యారు. బీఫార్మసీ చదివి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీచేశారు. జిల్లాలో అత్యధికంగా 1,446 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. జవ్వాజి అశ్విని 31ఏళ్ల వయసులో వైరా మండలం తాటిపుడి సర్పంచిగా ఎన్నికయ్యారు. ఆమె ఎంఫిల్ విద్యార్హత కలిగి ఉన్నారు. మహిళలకు 50శాతం స్థానాలు రిజర్వ్ కాగా అంతకుమించి అతివలు సర్పంచులుగా ఎన్నికయ్యారు. 31 నుంచి 50 ఏళ్ల మధ్య వయసులో కూసుమంచి మండలంలో 34 మంది, సింగరేణి మండలంలో 32 మంది, తిరుమలాయపాలెం మండలంలో 30 మంది సర్పంచులుగా గెలుపొందారు.




హైదరాబాద్, డిసెంబర్ 30: బీఆర్ఎస్ నేతలతో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈరోజు (మంగళవారం) సమావేశమయ్యారు. నందినగర్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు గులాబీ బాస్ దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ప్రధానంగా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి అసెంబ్లీ వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలన్నదే బీఆర్ఎస్ వ్యూహం. ఇందులో భాగంగానే ఈ అసెంబ్లీ సమావేశాలను పూర్తిగా ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ విషయంలో గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని, ఈ ప్రాజెక్ట్‌ను పక్కన పెట్టి కేవలం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మాత్రమే నిర్మించిందని అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపణ. బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల కాలంలో అటు కృష్ణా, ఇటు గోదావరి రెండు నదులపై చేపట్టిన ప్రాజెక్టులు, నీటి వాటాలు పరిష్కరించామని ఆ పార్టీ చెప్పుకొస్తోంది. ఇదే విషయంపై కొద్దిరోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం మధ్య మాటల యుద్ధం వ్యక్తిగత దూషణలకు దారి తీసింది. వీటన్నింటికి అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ గట్టి పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగానే కాసేపటి క్రితమే కేసీఆర్‌తో కేటీఆర్, హరీష్ రావు, ఇతర నాయకులు సమావేశమయ్యారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుంది?.. ప్రభుత్వం చెప్పే ప్రతీ అంశంపై సమాధానంతో సిద్ధంగా ఉండాలని ఇప్పటికే పార్టీ నేతలకు కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది.

## అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను ప్రకటించిన కేసీఆర్



హైదరాబాద్, డిసెంబరు 30 : తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేయనున్నారు. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారీని బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారీని కొనసాగించడం ద్వారా పార్టీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది. కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్‌లో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత కీలకంగా మారుతాయని గులాబీ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు.

## సంక్రాంతి రద్దీ.. హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్‌జామ్ కావొద్దు: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్: సంక్రాంతి నేపథ్యంలో జాతీయ రహదారులపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. గతంలో ఎదురైన అనుభవాల దృష్ట్యా వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ అంశంపై దృష్టి పెట్టారని చెప్పారు. "హైదరాబాద్-విజయవాడ హైవేపై జనవరి 8 నుంచి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోజుకు సుమారు లక్ష వాహనాలు ఆ మార్గంలో వెళ్తాయి. అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. బుధవారం తూప్రాన్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తా. ప్రధానంగా ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో వేలాది వాహనాల రద్దీ ఏర్పడుతుంది. ఈ ప్రాంతాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ ట్రాఫిక్‌జామ్ కావడానికి వీల్లేదు. పండగ రద్దీ ఉన్నన్ని రోజులూ రోడ్లు మూసేయొద్దు. భారీ యంత్రాలతో పనులు చేపట్టవద్దు. అత్యవసరమైనవి అయితే ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలి. రోడ్లపై మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలను పూర్తిగా తొలగించాలి. రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోటా పగలు, రాత్రి స్పష్టంగా కనిపించేలా ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. హై-విజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలి. ఎక్కడా ట్రాఫిక్‌కు అయోమయం కలిగించేలా ఏర్పాట్లు ఉండకూడదు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలి. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలి. అన్ని సంబంధిత శాఖలు పోలీసుల సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలి. అన్ని రహదారి ఘటనలను ప్రత్యేక ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలి. టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగకుండా వెళ్లేలా అదనపు బృందాలను ఏర్పాటు చేయాలి" అని మంత్రి ఆదేశించారు.

## గోదావరి- బనకచర్లపై గట్టిగా పోరాడింది మేమే: హరీశ్‌రావు

హైదరాబాద్: గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతుందని గట్టిగా పోరాటం చేశామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "బనకచర్ల విషయంలో కేంద్రం ఏర్పాటు చేసిన సమావేశానికి వెళ్లొద్దని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించాం. సమావేశానికి వెళ్లనని చెప్పిన సీఎం.. మీటింగ్‌కు వెళ్లి సంతకం చేశారు. కేంద్ర జలవనరులశాఖ సమావేశం అజెండాలో గోదావరి-బనకచర్ల అంశం ఉంది. సమస్య పరిష్కారానికి ఇరు రాష్ట్రాలు కలిసి కమిటీ వేసుకుని ముందుకువెళ్తాయని ఏపీ మంత్రి చెప్పారు. సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి తల ఊపి బయటికి వచ్చి ప్రజలకు అబద్ధాలు చెప్పారు. బనకచర్లపై ముందుకు వెళ్లే విషయంలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు కమిటీలు వేశాయి. చంద్రబాబు కమిటీ వేసిన వారానికే రేవంత్‌రెడ్డి కూడా ఒక కమిటీ వేశారు. చంద్రబాబు అనుకూల అధికారి ఆదిత్యనాథ్‌దాస్ నేతృత్వంలో ఏడుగురితో రేవంత్‌రెడ్డి కమిటీ వేశారు. రేవంత్‌రెడ్డి వేసిన కమిటీలో ఆరుగురు ఏపీతో సంబంధం ఉన్నవారే ఉన్నారు. బనకచర్లను ఏపీ ప్రభుత్వం ఎందుకు వెనక్కు తీసుకుందో కూడా ఈ ప్రభుత్వానికి తెలియదు. గోదావరి నీళ్లు కృష్ణాలో కలిపితే.. ఆ మేరకు మనకు అదనంగా నీళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. గోదావరి-బనకచర్లపై కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు లేఖలు రాశాయి. 64 టీఎంసీలు కోరుతూ కర్ణాటక, 21 టీఎంసీలు కోరుతూ మహారాష్ట్ర లేఖ రాశాయి. ఆ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు లేఖలు రాయడంతో బనకచర్లపై ఏపీ ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

గోదావరిని కృష్ణాలో కలపకుండా నల్లమల సాగర్‌లో కలపాలనేది ఏపీ సీఎం చంద్రబాబు ఆలోచన. బచావత్ ట్రైబ్యునల్ నుంచి తప్పించుకునేందుకు మరో రూపంలో ఏపీ ప్రాజెక్టుచేపడుతోంది. గోదావరి-నల్లమల సాగర్‌కు ఏపీ ప్రభుత్వం టెండర్లు కూడా వేసింది. టెండర్ల గడువు ముగిసిన తర్వాత ఈ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఒప్పుకొని కమిటీ వేశాక.. సుప్రీంకోర్టులో కేసు వేస్తే ఏం ప్రయోజనం. ఏపీ చేపడుతున్న ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు రెండు రకాలుగా నష్టం" అని హరీశ్‌రావు వివరించారు.




## శాంతి భద్రతలు అదుపులోనే.. వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ

హైదరాబాద్, డిసెంబర్ 30: తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులోనే ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు 2025 వార్షిక నివేదికను డీజీపీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది పండుగల బందోబస్తు పటిష్టంగా చేశామన్నారు. ఫ్యూచర్ సిటీలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతంగా భద్రతాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా దిగ్విజయంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుపుకున్నామని చెప్పారు. గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు విడతలు కూడా శాంతి భద్రతలు కాపీ ఎలక్షన్స్ అన్ని నిష్పక్షపాతంగా జరిగేలా కాపాడామని డీజీపీ అన్నారు.

**మహిళా పోలీసులు భేష్..** తెలంగాణలో 509 మంది నక్సల్స్ లొంగిపోయారని.. వారిలో 481 మంది ఛత్తీస్‌గఢ్, 21 మంది తెలంగాణ, ఒకరు మహారాష్ట్ర, ఒకరు ఏపీ నక్సల్స్ ఉన్నారన్నారు. నాలుగు నేషనల్ లోక్ అదాలత్, 1 స్పెషల్ అదాలత్ నిర్వహించమన్నారు. 7 లక్షల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని చెప్పారు. పోలీస్ శాఖను హైకోర్టు అభినందించిందని వెల్లడించారు. మూడు అంతర్జాతీయ ఈవెంట్స్ సక్సస్ ఫుల్‌గా నిర్వహించుకున్నామని తెలిపారు. తెలంగాణలో మహిళా పోలీసుల అధికారులు బాగా పనిచేస్తున్నారని కొనియాడారు. సీఐడీ చీఫ్, ఏసీబీ డీజీ చారు సిన్హా, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్తా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్గా షికా గోయల్, ఎస్ఐబీ ఐజీ సుమతి ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్లో క్యూఆర్ కోడ్ పెట్టడం జరిగిందని, ఫీడ్ బ్యాక్ కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**మొదటి స్థానంలో తెలంగాణ..** ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొచ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు.

**సైబర్ నేరాలు తగ్గాయ్..** దేశంలో 41 శాతం సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో 3 శాతం సైబర్ నేరాలు తగ్గాయన్నారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే 2.33% క్రైమ్ రేట్ తగ్గిందని వివరించారు. ఈ ఏడాది 2.28 లక్షలు కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో 4 కేసులో మరణ శిక్షలు ఖరారు అయ్యాయని.. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పండిందని తెలిపారు. ఫోక్సో కేసుల్లో 144 కేసుల్లో 154 మందికి శిక్షలు ఖరారు అయ్యాయని.. అందులో ముగ్గురికి మరణ శిక్ష, 48 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడ్డాయని డీజీపీ పేర్కొన్నారు.

**రూ.173 కోట్ల డ్రగ్స్ సీజ్..** తెలంగాణలో డ్రగ్స్ కేసులు భారీగా పెరిగాయని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే 30 శాతం డ్రగ్స్ కేసులు పెరిగినట్లు చెప్పారు. వేరే రాష్ట్రాల్లో ఉన్న నిందితులను ఈగల్ టీమ్ పట్టుకొస్తోందన్నారు. ఈగల్ టీమ్ ఈ ఏడాది రూ.173 కోట్ల డ్రగ్స్ సీజ్ చేసిందని అన్నారు. నమ్మక ద్రోహం కేసులు తెలంగాణలో 23 శాతం పెరిగాయన్నారు. ఐపీసీ సెక్షన్ కింద కేసులు 7.83 % పెరిగాయని.. అలాగే మహిళలపై దాడులు కేసులు 2.90 % పెరిగాయని అన్నారు. 248 మంది మహిళల హత్యలకు గురైయ్యారని తెలిపారు. రేప్ కేసులు 13% తగ్గిందని, కిడ్నాప్‌లు 10% , వేధింపులు కేసులు 9% తగ్గాయని అన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఈ ఏడాది 23% రికవరీ చేసిందని... రూ. 246 కోట్లు రికవరీ అయినట్లు తెలిపారు. 25,500 మంది బాధితులకు రూ.159 కోట్లు రీ ఫండ్ చేసినట్లు తెలిపారు.

**సీఐడీ విచారణలో నయీమ్ కేసు..** ప్రైవేటు సంస్థల్లో మహిళల కోసం కమిటీలు ఏర్పాటు చేశామని.. పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో ఈ ఏడాది ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయబోతున్నామని.. ఇందులో 18 నుంచి 35 ఏళ్ళు లోపు ఉన్న వారు హాజరువుతారని తెలిపారు. టీజీ ఆర్టీసీ డ్రైవర్లను ఈ ఏడాది పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ద్వారా పరీక్ష నిర్వహించామన్నారు. నయీమ్ కేసు సీఐడీ విచారణలో ఉందన్నారు. నయీమ్ కేసులో సీజ్ అయిన ల్యాండ్స్, చాలా మంది అమ్మాలని ప్రయత్నం చేశారని తెలిపారు. నయీమ్ లాండ్స్‌పై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. ఆ ల్యాండ్ ఎవరూ కొనవద్దని, అమ్మవద్దని ఆదేశాలు ఉన్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.




నాచారం(హైదరాబాద్): ఇల్లు అద్దెకు ఇచ్చిన యజమాని సుజాత(65)ను బంగారం కోసం హత్య చేసిన కేసును నాచారం పోలీసులు ఛేదించారు. ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు.. ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు వెళ్లి ఆమె మృతదేహం కోసం గాలింపు చేపట్టారు. నిందితుడు అంజిబాబును తీసుకువచ్చి గోదావరిలో గాలించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సుజాత మృతదేహం మామిడికుదురు సమీపంలోని అప్పనపల్లి-కె.ఏనుగుపల్లి మధ్య వైనతేయ గోదావరిలో లభ్యమైంది. నాచారం సీఐ ధనుంజయ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి వెళ్లారు.

**ఏం జరిగిందంటే..** ఇల్లు అద్దెకు ఇచ్చిన యజమానిని బంగారం కోసం క్యాబ్ డ్రైవర్ అంజిబాబు (33) హత్య చేశాడు. సీఐ ధనుంజయ తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం పీఎస్ పరిధిలోని మల్లాపూర్ బాబానగర్‌లో సూరెడ్డి సుజాత నివసిస్తున్నారు. భర్త, కుమారులు చనిపోవడంతో ఆమె ఒంటరిగా ఉంటున్నారు. ఏపీలోని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పెరవలి మండలం కొత్తపల్లికి చెందిన ఎం.అంజిబాబు డ్రైవర్ పని కోసం హైదరాబాద్ వచ్చాడు. రెండు నెలల క్రితం సుజాత ఇంట్లో అద్దెకు చేరాడు. ఈ నెల 19న రాత్రి ఆమెను హత్య చేసి ఒంటిపై ఉన్న 11 తులాల బంగారాన్ని దోచుకున్నాడు. మృతదేహాన్ని ఇంట్లోనే పెట్టి తాళం వేశాడు. ఈ విషయాన్ని పెరవలి మండలం కందవల్లిలోని స్నేహితుడు యువరాజు (18), అమలాపురం మండలం వేమవరానికి చెందిన స్నేహితుడు దుర్గారావు (35)కు చెప్పి తన సొంతూరుకు వెళ్లాడు. 20న ఆ ముగ్గురూ కారును అద్దెకు తీసుకుని మల్లాపూర్ చేరుకున్నారు. మృతదేహాన్ని కారులో కోనసీమ జిల్లాలోని కృష్ణలంకకు తరలించి గోదావరిలో విసిరేశారు. మొయినాబాద్‌లో ఉంటున్న సుజాత చెల్లెలు సువర్ణలత 24న సోదరి ఇంటికి రాగా.. ఆమె కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అద్దెకు ఉంటున్న అంజిబాబు కనిపించకపోవడంతో పట్టుకుని విచారించగా నేరం అంగీకరించాడు.

## తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదాం :మంత్రి జూపల్లి



హైదరాబాద్, డిసెంబరు 30 : తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశానికే దిక్సూచిగా తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వినూత్న మార్పులు అవసరమని పేర్కొన్నారు. ఇవాళ(మంగళవారం) తారామతి బరాదరిలో 'టూరిజం అండ్ ఇట్స్ విజన్ 2026' మేధోమథన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీటీడీసీ రూపొందించిన టేబుల్ క్యాలెండర్%-%2026ను ఆవిష్కరించారు. అనంతరం టూరిజం అండ్ ఇట్స్ విజన్ %-% 2026 వర్క్‌షాప్‌లో అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడారు మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ప్రకృతి, వారసత్వ సంపదే తెలంగాణ బలమని చెప్పుకొచ్చారు. కొత్త అద్భుతాలు కాదని.. ఉన్న వనరులకు మెరుగులు పరిస్తే చాలని తెలిపారు. దేశీ, విదేశీ పర్యాటకులు తెలంగాణ వైపు చూసేలా తాము ప్రణాళికలు రచిస్తున్నామని వివరించారు . గ్రామీణ అద్భుతాలను నగరవాసులకు చేరవేయాలని సూచించారు. పర్యాటక రంగంలో నూతన ఒరవడి రావాలని కోరారు. పర్యాటక అద్భుతాలను ప్రపంచానికి చూపాలని అన్నారు. తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదామని తెలిపారు. వినూత్న ఆవిష్కరణలతో పర్యాటకులను ఆకర్షించాలని చెప్పుకొచ్చారు. వసతులు, హాస్పిటాలిటీలో రాజీ పడొద్దని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.




## సంక్రాంతికి మరో 11 ప్రత్యేక రైళ్లు: దక్షిణ మధ్య రైల్వే

హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సంక్రాంతి పండగకు దక్షిణ మధ్య రైల్వే మరికొన్ని ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఇప్పటికే ప్రకటించిన రైళ్లకు అదనంగా మరో 11 ట్రైన్లను నడపనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. జనవరి 7 నుంచి 12వ తేదీ మధ్య కాకినాడ-వికారాబాద్, వికారాబాద్-పార్వతీపురం, పార్వతీపురం-వికారాబాద్, పార్వతీపురం-కాకినాడ టౌన్, సికింద్రాబాద్-పార్వతీపురం, కాకినాడ టౌన్-వికారాబాద్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. ఆయా రైళ్లలో 1ఏసీ, 2 ఏసీ, 3 ఏసీ, స్లీపర్ కోచ్‌లతో పాటు సెకండ్ క్లాస్ కోచ్‌లు కూడా అందుబాటులో ఉంటాయయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఆయా రైళ్లకు బుకింగ్స్ ప్రారంభమయ్యాయని పేర్కొంది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660